

భూపాలపల్లిలో నిర్వహించిన ప్రచారానికి భారీగా హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు



మాట్లాడు తున్న ఎమ్మెల్సీ సిరికొండ, పక్కన భూపాలపల్లి అభ్యర్థి గండ్ర

# అభివృద్ధి కొనసాగాలంటే కేసీఆర్‌ను సీఎం చేయాలి

- బీఆర్ఎస్‌ను మరో సారి ఆశీర్వదించండి
- కుగ్రామమైన భూపాలపల్లిని జిల్లా చేశాం
- 76 జీవో ద్వారా ఉచితంగా ఇళ్ల పట్టాలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర

భూపాలపల్లి రూరల్, నవంబర్ 18 : రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించాలంటే మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలని భూపాలపల్లి నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధి 16, 17, 29వ వార్డుల్లోని సుభాష్‌కాలనీ, రాంనగర్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద యాత్రకు మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి గండ్ర హాజరయ్యారు. వారికి మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కు గ్రామంగా ఉన్న భూపాలపల్లి నేడు జిల్లా కేంద్రంగా విలసిల్లుతున్నదని, వరంగల్ కార్పొరేషన్‌కు దీటుగా పట్టణం అభివృద్ధి చెందిందన్నారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి సుభాష్‌కాలనీ, రాంనగర్, కృష్ణ కాలనీ, కారల్‌మార్క్స్ కాలనీల వాసులకు 76 జీవో ద్వారా ఉచితంగా ఇండ్ల పట్టాలు ఇప్పించానన్నారు. సుభాష్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో పార్క్, రూ.4 కోట్లతో ఇండోర్ స్టేడియం, డిగ్రీ కళాశాల, బస్‌డిపో, కూరగాయల మార్కెట్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ తాగు నీటిని అందించామన్నారు. రాయాలయాన్ని రూ.25 లక్షలతో అభివృద్ధి చేశామన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని, కేంద్ర స్థాయి అవార్డులను కైవసం చేసుకుంటున్నదన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను రూపొందించిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్నారు. 17వ వార్డు అధ్యక్షుడు మచ్చ భద్రయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే గండ్ర ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

### బీఆర్ఎస్‌లో 100 మంది చేరిక

మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు సుభాష్‌కాలనీకి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు సతీశ్, ఉమ, ప్రసాద్, సర్వర్, తిరుపతి, అనసూయ, ప్రమీల, కార్తీక్, రాయమల్లు, సదానందంతో పాటు 100 మంది శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే గండ్ర ఆహ్వానించారు. ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్‌గౌడ్, 17వ వార్డు కౌన్సిలర్ ముంజంపెల్లి మురళీధర్, 29, 16వ వార్డుల ఇన్‌చార్జిలు అల్లూరి కుమార్, బైరెడ్డి లక్ష్మారెడ్డి, వార్డు అధ్యక్షులు పందిళ్ల మొగిలి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు లట్ట రాజబాబు, తిరుపతమ్మ, బీబీ చారి, బాలరాజ్ గౌడ్, యూత్ నాయకులు బుర్ర రాజు, భూక్యా శ్రీరామ్, తిరుపతిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

### గండ్రను అధిక మెజార్టీతో గెలిపించండి
*– మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ*

భూపాలపల్లి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేసి గండ్ర వెంకటరమణారెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కోరారు. భూపాలపల్లి అభివృద్ధికి తాను పునాది వేశానని, దానిని గండ్ర కొనసాగించారన్నారు. ఈ అభివృద్ధి వెనుక సీఎం కేసీఆర్ అండదండలు ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం గండ్ర అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఎమ్మెల్యేగా మరోసారి ఆశీర్వాదించాలని కోరారు. అభివృద్ధికి నావంతు సహాయ సహకారాలు అందిస్తానని సిరికొండ తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గంలో గండ్ర వెంకటరమణా రెడ్డి గెలుపే ఖాయమైనదని, గ్రామాలు, పట్టణంలో ప్రజలు ఆశీర్వదిస్తున్నారని అన్నారు.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

- ఓటు వేసే ముందు ఆలోచించాలి
- కాంగ్రెస్ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నది
- మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

మహాముత్తారం, నవంబర్18 : పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో 40 ఏండ్ల అభివృద్ధి జరిగిందని మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. శనివారం మండలలోని నిమ్మగూడెం, యత్నారం, సింగంపల్లి, రెడ్డిపల్లి, సింగారం, స్తంభంపల్లి పీకే, రేగులగూడెం, జీలపల్లి, మాదారం, వజినేపల్లి, స్తంభంపల్లి పీపీ, ములుగుపల్లి, పోలారం, ఉట్లపల్లి గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహాముత్తారం మండలం అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. కాంగ్రెస్ హయాంలో పట్టించుకున్న పాపానపోలేదన్నారు. తాను ఓడిపోయినా నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం ఆగలేదన్నారు. శ్రీధర్‌బాబుకు ఐదేండ్లు అవకాశం ఇస్తే ఏమీ చేయకుండా మళ్లీ గ్రామాల్లోకి వస్తున్నాడని ఆయనను నిలదీయాలన్నారు. ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ నాయకులు మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని వారిని నమ్మొద్దని ప్రజలకు సూచించారు. సీఎం కేసీఆర్ అనేక పథకాలను చెప్పకుండానే అమలు చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే కొత్త పథకాలను అమలు చేస్తామన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పేద ఆడబిడ్డలకు వివాహాలు ఎలా చేశానో మళ్లీ కాటారం, మంథని కేంద్రంగా ఏడాదికోసారి పెళ్లిళ్లు జరిపిస్తానని తెలిపారు. హైదరాబాద్‌లో రెండు హాస్టళ్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించాలని ప్రజలను కోరారు. మీనాజీపేట నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే ఎన్నికల ఖర్చు కోసం మధుకు యామన్‌పల్లి గ్రామానికి చెందిన పిలుమరి లక్ష్మి–మల్లయ్య దంపతులు రూ.10,116 అందించారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు కల్వచర్ల రాజు, మాజీ జడ్పీటీసీ మందల రాజిరెడ్డి, కాటారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాధారపుస్వామి, మండల మహిళా అధ్యక్షురాలు లింగమల్ల రమాదేవి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మార్క రాముగౌడ్, కాటారం సబ్‌డివిజన్ అధికార ప్రతినిధి జగన్‌నాయక్, మండల అధికార ప్రతినిధి బాలాజీ, మండల యూత్ అధ్యక్షుడు జాటోత్ జైపాల్‌నాయక్, మండల ప్రచార కమిటీ కన్వీనర్ పక్కల రాజబాపు పాల్గొన్నారు.



నిమ్మగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న మంథని అభ్యర్థి పుట్ట మధూకర్

# కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- ఎన్నికల్లో వారికి సరైన గుణపాఠం చెప్పాలి
- కొండాయి, మల్యాలలో మోడల్ కాలనీ ఏర్పాటు చేస్తాం
- ములుగు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నాగజ్యోతి
- ఏటూరునాగారంలో విస్తృత ప్రచారం
- హాజరైన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం, నవంబర్ 18 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని ములుగు బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. శనివారం ఆమె మండలంలోని చిన్నబోయినపల్లి, కొండాయి, మల్యాల, కొత్తూరు, భూటారం, ఎక్కెల గ్రామాల్లో ప్రచారం చేశారు. ఏటూరునాగారంలో భారీ ర్యాలీ నిర్వహించి ఎర్రమ్మ గుడి, ముస్లింవాడ, బొడ్రాయి సెంటర్లతో పాటు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే విస్మరించిందన్నారు. కాంగ్రెస్‌కు తాత ముత్తాతలు కూడా ఓట్లు వేశారని, ఏనాడైనా వారు గ్రామాల్లో కనీసం రోడ్లయినా వేశారా అని ప్రశ్నించారు. నా తండ్రి పోడు భూములు కొట్టిస్తే నాకు రాజకీయ పునర్జన్మ ఇచ్చిన కేసీఆర్ ఆ భూములకు పట్టాలు ఇచ్చారన్నారు. రాబోయే రోజుల్లో గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 24 గంటల కరెంటు ఇస్తున్నప్పటికీ మూడు గంటలు చాలు అని ధనసరి అనసూయ అంటున్నదని ప్రజలకు వివరించారు. స్వపక్షం, విపక్షమనే తేడాలేకుండా అందరికీ రైతుబంధు, కల్యాణలక్ష్మి పథకాలను అమలు చేసింది బీఆర్ఎస్ మాత్రమే అన్నారు. ప్రభుత్వం తనకు నిధులు ఇవ్వడం లేదని సీతక్క ప్రచారం చేస్తున్నదని, కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎలా పంపిణీ చేశావంటూ నాగజ్యోతి ప్రశ్నించారు. పార్టీ, నాయకులపై తప్పుడు ప్రచారం, నిందలు వేస్తున్నదన్నారు. మల్యాల, కొండాయి గ్రామాలు వరద ముంపునకు తీరని నష్టం వాటిల్లిందని, ఈ గ్రామాల్లో మోడల్ కాలనీలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వరదల సమయంలో అధికారులను నియమించి సత్వర చర్యలు చేపట్టినట్లు వివరించారు. వారం రోజుల పాటు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ఆదుకున్నదన్నారు. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్, రోడ్లు, డయాలసిస్, మాతా శిశు సంరక్షణ కేంద్రం కేవలం కేసీఆర్ ఘనతే అన్నారు. బిల్ట్ ఫ్యాక్టరీ తెరిచిన తర్వాత స్థానికులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో నాసిరకం పనులు చేసి సంపాదించిన కోట్ల రూపాయలు ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉందని ఆరోపించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బీఆర్ఎస్‌ను మరోసారి పట్టంకట్టాలన్నారు. పేదింటి ఆడబిడ్డ నాగజ్యోతిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చిన్నబోయినపల్లిలో పోడు భూముల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రచారంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఎంపీపీ అంతటి విజయ, జడ్పీ కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, సప్పిడి రాంనర్సయ్య, వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కూనూరు మహేశ్, ఎంపీటీసీ కోట నర్సింహులు, నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, తాడూరి రఘు, ఖాజా పాషా, మాదిరి రామయ్య, కోనేరు నగేశ్, సర్దార్ పాషా, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్, రాజు, సిద్దబోయిన రాంబాబు, సర్పంచులు ఈసం రామ్మూర్తి, కాక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మల్యాల గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న ములుగు బీఆర్ఎస్ అభ్యర్థి నాగజ్యోతి